క్లుప్తంగా

రేపు పోలేపల్లిలో బహిరంగ వేలం

కొడంగల్ : దుద్యాల మండలం పోలేపల్లిలో వెలిసిన స్వయంభు శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయానికి సంబంధించి పలు అంశాలపై మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి 29 నుంచి మార్చి 15 వరకు టెంకాయలు అమ్ముకోడానికి డిపాజిట్ రూ.80వేలు, బ్రహ్మోత్సవాల తర్వాత రోజు 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల వరకు ఏడాది పాటు టెంకాయలు అమ్ముకోడానికి రూ.90వేలు డిపాజిట్, ఒక ఏడాది లడ్డూ ప్రసాదం, పులిహోర విక్రయాలకు రూ.30వేలు డిపాజిట్‌గా నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

క్రీడల్లో రాణించాలి

సీఐ అశోక్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

తాండూరు రూరల్: గ్రామీణ ప్రాంత యువకులు క్రీడాల్లో రాణించాలని తాండూరు రూరల్ సీఐ అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని జినుగుర్తిలో పట్నం రవికాంత్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ.. స్నేహితుడి గుర్తుగా ప్రతి ఏడాది టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. జినుగుర్తి గ్రామస్తులు, యువకులను అభినందిస్తున్నానని తెలిపారు. క్రీడలతో యువకులలోని ప్రతిభను వెలికితీయొచ్చని చెప్పారు. కార్యక్రమంలో జినుగుర్తి వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాలక మండలికి సన్మానం



పాలకమండలి మాజీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బషీరాబాద్: మండలంలోని బోజ్యానాయక్ తండాకు చెందిన పూర్వ పంచాయతీ పాలక మండలికి గ్రామస్తులు ఆదివారం ఘనంగా పౌర సన్మానం చేశారు. సర్పంచ్‌గా శాంతిబాయి చేసిన సేవలను, వార్డు సభ్యుల సేవలను కొనియాడారు.

పేదలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల : పేద కుటుంబాలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన చిల్ల పుల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పేద కుటుంబాలతో పాటు కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు కేశవులు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మండల సమన్వయ అధ్యక్షుడు రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో పర్యాటకుల సందడి



విల్లు ఎక్కు పెట్టిన మహిళ

ధారూరు: ఆహ్లాదకరమైన వాతావరణంలో కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను చూసేందుకు పర్యాటకులు సెలవు దినం వస్తే చాలు పరుగు తీస్తుంటారు. అందులో ఆదివారం వచ్చిందంటే చాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే గడుపుతారు. ప్రాజెక్టుకు వచ్చిన మహిళలు, యువతుల కోసం ప్రాజెక్టు ఒడ్డున ఏర్పాటు చేసిన బో అండ్ యారో(అర్చరీ బాటల్ త్రీడీ ఆట) ఆట ఆకట్టుకుంటుంది.



ఫొటోకు ఫోజిస్తున్న యువతులు

సీసీఐ కేంద్రాన్ని తెరవండి

- ఎమ్మెల్యేకు విన్నవించిన అన్నదాతలు
- ఐదు రోజుల నుంచి మూత
- ధరలేక దళారులతో మోసపోతున్న రైతులు



పెద్దేముల్‌లోని పత్తి మిల్లు

పెద్దేముల్: ఐదు రోజుల నుంచి సీసీఐలో పత్తి కొనుగోలు నిలిచిపోవడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పత్తి మిల్లులో సీడ్స్, బెల్స్, పత్తి స్టాక్ ఉందని సాకుతో కాటన్ అధికారులు తుకాలు బంద్ చేశారు. దీంతో ఎటుతోచక రైతులు దళారుల పాలవుతున్నారు. సీసీఐ రూ.6920 ధర ఉంటే మార్కెట్‌లో దళారులు రూ.6000నుంచి 6150ల వరకు ఖరీదు చేసి రైతులను నట్టేల ముంచుతున్నారు. తేమ సాకుతో తూకాల్లో మోసం చేస్తున్నారు. దీంతో ఏడాది పాటు చేసిన కష్టం దళారుల పాలవుతుందని రైతు వాపోతున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ, వ్యవసాయ, మార్కెట్ శాఖల అధికారులకు తెలియజేసిన ఎలాంటి ఫలితం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి విషయాన్ని పలువురు రైతులు ఫోన్ ద్వారా తెలియజేయగా వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే తూకాలు జరిగేలా చర్యలు తీసుకుంటానని చెప్పడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గత రెండేళ్ల నుంచి పత్తికి మద్దతు ధర లభించడంతో ఈ ఏడాది పెద్దేముల్ మండలంలో రైతులు సుమారు 70 శాతం నుంచి 80 శాతం వరకు పత్తి పంటను సాగును చేశారు. ధర బాగుంటుందని పెట్టుబడులు రెండింతలు పెట్టారు. పంట చేతికి వచ్చే సరికి క్వింటాళ్లకు రూ. 3 వేలు తగ్గింది. గతంలో 9500 నుంచి రూ.9800ల వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.6000 నుంచి రూ.7000లు మించడం లేదు. దీంతో మళ్లీ అప్పులు చేయక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పండించిన పంటకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ ద్వారా విక్రయాలు చేయాలని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. కాటన్ అధికారులు పత్తి మిల్లులో పత్తి, బెల్స్, సీడ్స్ స్టాక్ ఎక్కువ ఉందని ఆలస్యం చేస్తున్నారు.

86,592 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

పెద్దేముల్ మండలంలో ఉన్న రెండు పత్తి మిల్లుల ద్వారా ఇప్పటి వరకు 86,592 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి ఖరీదు చేయడం జరిగిందని పెద్దేముల్ మండల కాటన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వరకు సుమారు 65 నుంచి 70 శాతం వరకు పత్తి, బెల్స్, సీడ్స్ మిల్లుల నుంచి పంపిణీ జరిగిందని, పై నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే సీసీఐ కొనుగోలు ప్రారంభం చేస్తామని వారు తెలియచేశారు.

వెంటనే కొనుగోలు ప్రారంభించాలి



మండలంలో వరుణదేవుడు ఆలస్యంగా వర్షాలు కురవడం.. విత్తనాలు ఆలస్యం కావటం.. పంటలు చేతికి ఆలస్యంగా రావడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఫిబ్రవరి వరకు కొనసాగించాలి. అప్పుడే పత్తి పండించిన రైతులు న్యాయం జరుగుతుంది. అసలైన రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర దక్కుతుంది. ఐదు రోజుల నుంచి సీసీఐ నిలిపి వేయడంతో రైతులు దళారుల పాలవుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేయాలి.

– నారాయణరెడ్డి, రైతు మంబాపూర్

నష్టపోతున్నాం..



సీసీఐ నిలిపివేయడంతో దళారుల పాలవుతున్నాం. క్వింటాళ్లకు రూ.800 నుంచి 900ల వరకు నష్టపోతున్నాం. ఏడాది పాటు చేసిన కష్టం దళారుల పాలవుతుంది. ఇప్పటికే ధర గిట్టుబాటు లేక, పెట్టుబడులు రెండింతలు పెరగటంతో అప్పుల పాలవుతున్నాం. ఏ ప్రభుత్వం వచ్చిన రైతుల రాత మారడం లేదు. ఏదో ఓ విధంగా రైతు అప్పుల పాలవుతున్నాడు. సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని వెంటనే తెరువాలి. లేదా దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– రాములు రైతు, పెద్దేముల్

హామీలు నిలబెట్టుకుంటాం

స్పీకర్ ప్రసాద్ కుమార్ కుమార్తె అనన్య



బోరు పనులు ప్రారంభిస్తున్న అనన్య చేతన్

ధారూర్: మా నాన్నను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటానని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ తనయ అనన్య చేతన్ ప్రజలకు వాగ్దానం ఇచ్చింది. గెలిచిన అనంతరం నేనే వచ్చి మీ సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల ప్రచారంలో ప్రజలకు భరోసా ఇచ్చింది. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆదివారం మండలంలోని కుమ్మరపల్లి, డీకే తండా, ధారూరు, నాగసముందర్ గ్రామాల్లో ఇచ్చిన హామీల అమలకు ఆమె శ్రీకారం చుట్టారు. నాగసముందర్, ధరూరు, డీకే తండాల్లో తాగునీటి సమస్య తీర్చడానికి బోర్లు వేసేందుకు రూ.పది లక్షల చొప్పున కేటాయించారు. ఈ గ్రామాల్లో బోరు పాయింట్లను గుర్తించి ఆమె భూమిపూజ చేసి డీకే తండాలో బోరు డ్రిల్లింగ్ ప్రారంభించారు. కుమ్మరిపల్లిలో గ్రామస్తులకు ఇబ్బందికరంగా ఉన్న కరెంటు సమస్య పరిష్కరించి చింతచెట్టు తొలగిస్తామని ఎన్నికల ప్రచారంలో ఆమె హామీ ఇచ్చారు. నిబంధనలు పాటిస్తూ అధికారుల అనుమతులు పొంది చెట్టును తొలగించాలని కరెంట్ సమస్యను పరిష్కరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ధారూరు, స్టేషన్ ధారూరు, నాగ సముందర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున, కుమ్మరిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, నాయకులు బుజ్జయ్య గౌడ్, మల్లారెడ్డి, కిషోర్, బాబఖాన్, రాజేశ్వర్, అశోక్, మల్లేశం, మల్లారెడ్డి, గఫర్, యాదయ్య, లాల్ మహమ్మద్, ముజాఫర్ ఇబ్రహీం, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా కట్ట మైసమ్మ జాతర



బోనాల ఊరేగింపు

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం గుమాస్తానగర్‌లో కొలువైన శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి అభిషేకంతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో భాగంగా మధ్యాహ్నం పల్లకీసేవ, సాయంత్రం బోనాల ఊరేగింపు వైభవంగా కొనసాగాయి. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరుడు ఆర్బీఎల్ ఫ్యాక్టరీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అమ్మవారి పల్లకీ సేవాలో పాల్గొన్నారు. స్థానిక కౌన్సిలర్ మంకాల్ రాఘవేందర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనమెత్తారు.

ధారూరు బస్టాండ్‌లో

ప్రయాణికుల పాట్లు

- తాగునీరు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- నిర్వహణ సరిగాలేదని ఆందోళన

ధారూరు: ధారూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కనీసం కూర్చునేందుకు అవసరమైనన్ని బల్లలు లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కింద కూర్చున్నారు. ఎండాకాలం సమీపిస్తున్నా బస్టాండ్‌లో కనీసం తాగేందుకు మంచి నీటికి కూడా దిక్కులేదని గురువారం ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి, రెండుకు వెళ్లేందుకు నిర్మించిన మరుగుదొడ్లు పనికి రాకుండా పోయాయని, మగవారు బహిరంగ ప్రదేశానికి వెళ్తున్నా.. ఆడవారికి వీలుకాక అష్టకష్టాలు పడుతున్నారని ప్రయాణికులు వాపోయారు. వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్నా బస్టాండ్ మెయింటెనెన్స్ మాత్రం తాండూరు ఆర్టీసీ డిపో చేయడం వల్ల పట్టింపు లేకుండా పోయిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రిపూట ఆ ప్రాంతమంతా చిమ్మ చీకటేనని, బస్టాండు మెయింటెనెన్స్ ఓ కలేనని ఆవేదన వ్యక్తం చేశారు. తాండూర్–వికారాబాద్ మధ్య ఉన్న ఈ బస్టాండులోకి కొన్ని బస్సులు వచ్చి వెళ్లడం, మరికొన్ని బస్సులు రోడ్డుపై నుంచి వెళ్లడం షరా మామూలైంది. బస్టాండ్ బాధ్యత తీసుకున్న తాండూర్ డిపో వారు సక్రమంగా నిర్వహణ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నేలపై కూర్చొని, నిలబడి బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రయాణం.. నరకప్రాయం

- కంకర తేలిన పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



కంకర తేలిన పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు

దోమ : గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారాయి. కురిసిన వర్షాలకు కంకర తేలి గుంతలుగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో పలు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో మీకు అది చేస్తాం.. ఇది చేస్తామని హామీలు ఇచ్చేందుకు వచ్చిన నేతలకు కంకర తేలిన రోడ్డు కనపడటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

చీకటిపడితే నరకమే..

మండలంలోని పాలేపల్లి మీదుగా ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో అటుగా మల్లేపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, గుండాల వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు కంకర తేలడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. చీకటైతే నరకం అనుభవిస్తున్నామని ప్రయాణికులు జంకుతున్నారు. రోడ్లు కంకర తేలిన విషయం సంబంధిత అధికారులు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు..

గత ప్రభుత్వం గ్రామీణ రోడ్లపై దృష్టి సారించకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. నిత్యం వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన గ్రామీణ రోడ్లపై దృష్టి సారించి త్వరితగతిన మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



పాలేపల్లి నుంచి ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుతున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి పరిగి పట్టణం నుంచి ఐనాపూర్ గ్రామానికి వస్తుండగా కంకర తేలడంతో జారీ పడి గాయాలపాలయ్యాడు. సంబంధిత అధికారులు బీటీ రోడ్డును పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలి.

– యాదయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



మౌనికను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపునకు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. పార్టీ అధికారంలోకి రాలేదని నాయకులు, కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహ పడకూడదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఇస్నాతి మౌనికను ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఇస్నాతి మచ్చేందర్, భీష్వ రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, హన్యా నాయక్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయంగా రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పామెన జ్యోతి

చేవెళ్ల: మహిళలు రాజకీయంగా రాణించాలని కాంగ్రెస్ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మహిళలకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళల కోసం కాంగ్రెస్ అనేక సంక్షేమ పథకాలను తీసుకురానున్నదని చెప్పారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోందని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ స్థాయిలో పెద్ద ఎత్తున మహిళా సమావేశాన్ని ఈ నెల 10న చేవెళ్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మహిళా కాంగ్రెస్ కమిటీలను ఆమె కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ కమిటీ నాయకురాళ్లు దేవర సమత, శైలజరెడ్డి, నాగమణి, అమృత, రమ్య, శ్రీరెడ్డి, ప్రత్యూషరెడ్డి, అశ్విని, సుశీల, కళబూవతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 2009–2010 బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమేళ్మనం ఏర్పాటు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువ, పూలమాలతో సన్మానించారు. పాఠశాల్లో అనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

ప్రశాంతంగా 'ప్రతిభ' ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభ కళాశాలలో (సీఓఈ) 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గురుకుల సీఓఈ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో సీఓఈ సెట్ నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో 480 మంది విదార్థులకుగాను 449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 31మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రంవద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఓఈ పరీక్ష కేంద్రం పరిశీలకురాలు రాజేశ్వరి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేయడంతో పాటు మంచి నీటి వసతి కల్పించారు. దీంతో ప్రతిభ కళాశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

అనంతగిరిలో వ్యర్థాలు



రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలు

వికారాబాద్ అర్బన్: అనంతగిరి అటవీ ప్రాంతం వ్యర్థాలతో నిండిపోతోంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఎక్కడ పడితే అక్కడ భోజనాలు చేసి ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను వదిలేసిపోతున్నారు. కొన్నిచోట్ల విచ్చలవిడిగా మద్యంతాగి సీసాలు పారవేస్తుండటంతో మామూలు పర్యాటకులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొన్నిచోట్ల పాత బట్టల మూటలను తెచ్చి అడవిలో వేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, బట్టను అడవి జంతువులతో పాటు, అనంతగిరిలో ఉండే పశువులు సైతం తింటుండటంతో మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు పర్యాటకులపై దృష్టి సారించి వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పాతబట్టల మూటలు పడేసిన పర్యాటకులు